సాక్షి పశ్చిమగోదావరి

మంగళవారం । 2 । జూలై । 2024



అనుబంధం.. శోభాయమానం

ద్వారకాతిరుమల చినవెంకన్న క్షేత్రానికి అనుబంధంగా ఉన్న ఆలయాలు, ఉపాలయాల్లో ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడుతోంది.

8లో



సరైన పోషణతో అధిక దిగుబడి

పాడి పశువుల పెంపకంలో తగు జాగ్రత్తలు పాటిస్తూ సరైన పోషణతో అధిక దిగుబడులు సాధించవచ్చని పశు వైద్యాధికారి సూచించారు.

8లో



సామర్థ్యాలు మెరుగుపర్చాలి

తరగతి గదిలో అభ్యసనా నైపుణ్యాలను పెంపొందించడమే టీచ్ టూల్ లక్ష్యమని జిల్లా ఇన్‌చార్జి ఏఎంఓ రామారావు అన్నారు.

8లో

న్యూస్‌రీల్

పంచారామక్షేత్రంలో ఏలూరు ఐజీ పూజలు



సోమారామంలో ఐజీ అశోక్‌కుమార్ దంపతులు

భీమవరం(ప్రకాశం చౌక్) : భీమవరం గునుపూడిలోని పంచారామక్షేత్రం ఉమా సోమేశ్వర జనార్దన స్వామి ఆలయాన్ని (సోమారామం) సోమవారం ఏలూరు రేంజ్ ఐజీ జీవీ అశోక్ కుమార్ దంపతులు సందర్శించారు. ఆలయంలో స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు చేయించారు. ఐజీ దంపతులకు ఆలయ అర్చకులు వేద ఆశీర్వాచనం అందించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి డి.రామకృష్ణంరాజు పాల్గొన్నారు.

ఇంటి వద్దే పింఛన్ పంపిణీ



అడవిపాలెంలో వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

పాలకొల్లు అర్బన్ : ఇంటి వద్దే పింఛన్‌లు పంపిణీ చేస్తామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. సోమవారం పాలకొల్లు పట్టణం, మండలం, యలమంచిలి, పోడూరు మండలాల్లోని పలు గ్రామాల్లో ఆయన బైక్‌పై పర్యటించి వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేశారు. జిల్లాలో 2,32,885 మంది లబ్ధిదారులకు రూ.155.71 కోట్లను అందించనున్నామన్నారు.

సత్వర పరిష్కారానికి చర్యలు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ అజిత

భీమవరం (ప్రకాశంచౌక్) : ప్రజలు సమస్యలపై ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే చట్టప్రకారం విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ అజిత అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో భాగంగా అర్జీదారుల నుంచి 13 ఫిర్యాదులు స్వీకరించారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) వి.భీమారావు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

అందరినీ ఒకచోటకు చేర్చి.. పింఛన్ల పంపిణీ

సర్వర్లు పనిచేయలేదంటున్న సిబ్బంది



ములగలంపల్లిలో పింఛనుదారులను ఒక చోటుకు చేర్చి పింఛన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: గిరిజన ప్రాంతంలో సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో గతంలోలా ఇంటింటికీ వెళ్లకుండా అందరినీ ఒకచోటకు చేర్చి పంపిణీ చేసిన పరిస్థితి చోటుచేసుకుంది. ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం ములగలంపల్లిలో సోమవారం ఈ ఘటన జరిగింది. ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉండగా, సర్వర్లు పనిచేయలేదంటూ సచివాలయ సిబ్బంది ఉదయం 11 గంటల తర్వాత హడావుడిగా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కొన్నిచోట్ల లబ్ధిదారులను ఒకేచోటుకు రప్పించి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ వ్యవహారంపై లబ్ధిదారులు అసహనం వ్యక్తం చేయడం కనిపించింది.

ఓపెన్ స్కూల్ ఫలితాల విడుదల

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) పదో తరగతి, ఇంటర్మీడియెట్ కోర్సుల ఫలితాలు విడుదలయ్యాయని డీఈఓ ఎస్.అబ్రహం ప్రకటనలో తెలిపారు. పదో తరగతిలో 692 మందికి 64 మంది, ఇంటర్మీడియెట్‌లో 1,080 మందికి 602 మంది ఉత్తీర్ణులయ్యారని పేర్కొన్నారు. రీ కౌంటింగ్‌కు సబ్జెక్టుకు రూ.200, రీ వెరిఫికేషన్‌కు రూ.1,000 చొప్పున వెబ్‌సైట్‌లోని పేమెంట్ గేట్‌వే ద్వారా చెల్లించాలని సూచించారు. రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్ దరఖాస్తులకు మంగళవారం నుంచి ఈనెల 13వ తేదీ వరకూ గడువు ఉందని పేర్కొన్నారు.

పీఎం కిసాన్ అర్హతపై ఆరా

- లబ్ధిదారుల జాబితాపై అధికారుల విచారణ
- 5 శాతం మందిని పరిశీలించాలని ఆదేశాలు
- జిల్లాలో 85,378 మంది అర్హులు
- 7,734 మంది రైతుల అర్హతపై సర్వే



రైతు వివరాలు వివరాలు అప్‌లోడ్ చేస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

సాక్షి, భీమవరం: ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం కిసాన్) పథకం లబ్ధిదారుల్లో అనర్హులను గుర్తించే పనిలో ప్రభుత్వం నిమగ్నమైంది. గత రెండేళ్లకు గాను లబ్ధిదారుల్లోని ఐదు శాతం మంది వివరాలను పరిశీలించి ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. వారి జాబితాను ప్రభుత్వమే సిద్ధం చేసి అధికారులకు అందజేసింది. ప్రస్తుతం ఈ ప్రక్రియ జిల్లాలో ముమ్మరంగా సాగుతోంది.

2019 నుంచి పథకం అమలు

పీఎం కిసాన్ పథకం కింద రైతులను ఆదుకునేందుకు 2019 నుంచి కేంద్ర ప్రభుత్వం ఏటా రూ.6 వేల చొప్పున అందిస్తోంది. ఖరీఫ్ ప్రారంభం, కోతలు, రబీ ప్రారంభంలో విడతకు రూ.2 వేల చొప్పున అర్హుల ఖాతాల్లో జమచేస్తోంది. ప్రస్తుత సీజన్‌కు గాను మొదటి విడతగా ఇటీవల జిల్లాలోని 85,378 మంది రైతులకు రూ.17.07 కోట్లు సాయం అందజేసింది.

ప్రత్యేక సర్వే

పథకం అమలులో భాగంగా గతంలో తొలివిడత సాయం విడుదలకు ముందు ఏటా లబ్ధిదారుల బయోమెట్రిక్ తీసుకుని ఈకేవైసీ చేయించేవారు. దీనివలన భౌతికంగా ఉన్న వారికి మాత్రమే ప్రభుత్వ లబ్ధి అందుతుంది. లబ్ధిదారుల్లో అనర్హులుంటే వారిని గుర్తించి తొలగించేందుకు ప్రత్యేక సర్వే నిర్వహిస్తుంది. గతంలోనూ అనర్హులను గుర్తించి తొలగించారు. అందులో భాగంగా ఈ ఏడాది అనర్హులను గుర్తించేందుకు చర్యలు చేపట్టింది. 2022–23, 2023–24 ఆర్థిక సంవత్సరాల్లో పీఎం కిసాన్ పథకం కింద లబ్ధిపొందిన వారి వివరాలను పరిశీలిస్తోంది. రెండేళ్లలో లబ్ధిదారుల నుంచి ఐదు శాతం చొప్పున 2022లో 3,711 మంది, 2023లో 4,023 మంది రైతుల వివరాలతో జాబితాను సిద్ధం చేసి వ్యవసాయశాఖకు అందజేసింది. ఈ మేరకు ఆ లబ్ధిదారులు భౌతికంగా ఉన్నారా? లేదా?, అర్హులా? కాదా ? తదితర వివరాలను సేకరించే పనిలో వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది నిమగ్నమయ్యారు. లబ్ధిదారుల ఫొటో తీసి పీఎం కిసాన్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. తాజా పరిశీలనలో లబ్ధిదారుల్లో కొందరు మృతిచెంది ఉండటం, భూమి బదలాయింపు, విదేశాలకు వెళ్లిపోవడం వంటి అంశాలు వెల్లడవుతున్నాయని అధికారులు అంటున్నారు.

పరిశీలిస్తున్న అంశాలు

- ఆదాయపు పన్ను కడుతున్నవారు ఉన్నారా.
- భూమి లేకుండా లబ్ధిదారుడు పథకం లబ్ధి పొందుతున్నారా.
- పథకం పొందుతున్న వారిలో ప్రస్తుత, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, శాసనమండలి సభ్యులు, రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారా.
- భూమి వివరాలు సరిపోకపోవడం.
- 2019 తర్వాత భూమి రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారు.
- ఒక కుటుంబంలో ఒక లబ్ధిదారుడు ఉండగా మరో కుటుంబ సభ్యునికి కూడా పథకం వర్తించడం.
- ఆధార్ మనుగడలో లేకపోవడం.
- రాష్ట్రం నుంచి వలస వెళ్లిపోయిన వారు.
- భూమి సాగు చేయకుండా స్వచ్ఛందంగా వదిలేయడం.
- 18 ఏళ్ల లోపు వయసు ఉన్న వారికి ఎవరికైనా పథకం వర్తిస్తుందా.
- తదితర వివరాలు సేకరిస్తున్నారు.

70 శాతం సర్వే పూర్తి



గత రెండేళ్లలో పీఎం కిసాన్ లబ్ధిదారుల నుంచి ప్రభుత్వం విడుదల చేసిన జాబితా మేరకు పరిశీలన చేస్తున్నాం. వ్యవసాయశాఖ సిబ్బంది లబ్ధిదారుల వద్దకు వెళ్లి వివరాలు సేకరించి యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో 70 శాతం మేర పరిశీలన పూర్తయ్యింది. లబ్ధిదారుల్లో కొందరు భూమిని విక్రయించుకోవడం, విదేశాలకు వెళ్లిపోవడం, మృతిచెందడం వంటివి పరిశీలనలో వెల్లడవుతున్నాయి.

– జెడ్.వెంకటేశ్వరరావు, వ్యవసాయశాఖ జేడీ, పశ్చిమగోదావరి జిల్లా

ప్రజా ఫిర్యాదులకు సత్వర పరిష్కారం

కలెక్టర్ నాగరాణి



సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం(ప్రకాశం చౌక్) : ప్రజా ఫిర్యాదులకు సత్వరమే పూర్తి పరిష్కారం చూపాలని కలెక్టర్ సి.నాగరాణి అన్నారు. సోమవారం భీమవరం కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం ఉండాలన్నారు. వచ్చిన ఫిర్యాదు తిరిగి మళ్లీ రావడం ఎట్టి పరిస్థితుల్లో ఉండకూడదన్నారు. సుదూర ప్రాంతాల నుంచి నమ్మకంతో ప్రజలు వస్తున్నారని, వారికి కచ్చిత పరిష్కారం సత్వరం చూపాలన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా 107 అర్జీలు స్వీకరించామన్నారు. జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్య, జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు, కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణరెడ్డి, జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల అధికారి కేసీహెచ్ అప్పారావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

క్షీరారామం ఈఓగా శ్రీనివాసరావు

పాలకొల్లు (సెంట్రల్) : పంచారామక్షేత్రం పాలకొల్లు క్షీరారామలింగేశ్వర స్వామి దేవస్థానం కార్యనిర్వాహణాధికారిగా ముచ్చర్ల శ్రీనివాసరావును నియమిస్తూ దేవాదాయశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు ఇక్కడ ఈఓగా పనిచేసిన యాళ్ల సూర్యనారాయణ బదిలీ అయ్యారు.

పరిశుభ్రతతో అతిసార నియంత్రణ

కలెక్టర్ నాగరాణి



డయేరియా అవగాహన ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశం చౌక్) : పరిశుభ్రతతో డయేరియాను అరికట్టవచ్చని కలెక్టర్ సి.నాగరాణి అన్నారు. సోమవారం భీమవరం అంబేడ్కర్ సెంటర్ నుంచి స్టాప్ డయేరియా అవగాహన ర్యాలీని జెండా ఊపి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆగస్టు 31 వరకు స్టాప్ డయేరియా కార్యక్రమం సాగుతుందన్నారు. దీనిలో భాగంగా జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. తాగునీరు కలుషితం కాకుండా చూడాలని, రక్షిత నీటిని సరఫరా చేయాలన్నారు. గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని కోరారు. పరిశుభ్రతపై అవగాహనతో పాటు ముందు జాగ్రత్త చర్యలతో వ్యాధులను అరికట్టవచ్చాన్నారు. తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ జరిగింది. డీఎంహెచ్‌ఓ డి.మహేశ్వరరావు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి దేవ సుధాలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకవాడ రంగసాయి, ఐసీడీఎస్, వైద్య శాఖ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ

కలెక్టరేట్‌లో స్టాప్ డయేరియా వాల్‌పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించి, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, జింక్ టాబ్లెట్ల పంపిణీని ప్రారంభించారు. జిల్లాలో ఐదేళ్లలోపు పిల్లలకు రెండు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, 14 జింకు మాత్రల చొప్పున పంపిణీ చేయనున్నామన్నారు. జేసీ సీవీ ప్రవీణ్ ఆదిత్య, డీఆర్వో జె.ఉదయభాస్కరరావు, కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణరెడ్డి, డీఎంహెచ్‌ఓ డి.మహేశ్వరరావు, డీసీహెచ్‌ఎస్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

సామాజిక భద్రత కోసం పింఛన్

కలెక్టర్ నాగరాణి



కుముదవల్లిలో పెన్షన్ అందిస్తున్న కలెక్టర్ నాగరాణి

పాలకోడేరు: పేదల సామాజిక భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్ పంపిణీ చేస్తోందని కలెక్టర్ సి.నాగరాణి అన్నారు. సోమవారం మండలంలోని కుముదవల్లిలోని ఎస్సీపేటలో నిర్వహించిన ఎన్టీఆర్ పెన్షన్ భరోసా కార్యక్రమంలో ఆమె పాల్గొని లబ్ధిదారులకు పింఛన్ నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 2,32,885 మంది లబ్ధిదారులకు జూలై నెలకు రూ.155.71 కోట్లను పంపిణీ చేయనున్నామని, ఉదయం 6 గంటలకే పంపిణీ ప్రారంభించామన్నారు. డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్‌ఎస్ వేణుగోపాల్, ఏపీఓ టి.మురళీకృష్ణ, తహసీల్దార్ నాగార్జున, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసరాజు, సర్పంచ్ భూపతిరాజు కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

కొత్త చట్టాలతో న్యాయ ప్రక్రియకు విఘాతం



నరసాపురంలో కోర్టు సముదాయాల వద్ద ఆందోళన చేస్తున్న న్యాయవాదులు

నరసాపురం: కేంద్ర ప్రభుత్వం కొత్తగా అమల్లోకి తీసుకొచ్చిన క్రిమినల్ చట్టాలను వెంటనే రద్దు చేయాలని పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం న్యాయవాదుల సంఘం డిమాండ్ చేసింది. సోమవారం చట్టాల రద్దు కోరుతూ న్యాయవాదులు విధులు బహిష్కరించారు. కోర్టు సముదాయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చల్లా దానయ్యనాయుడు మాట్లాడుతూ హడావిడిగా ఈ చట్టాలను అమలు చేయడం వల్ల న్యాయ ప్రక్రియకు విఘాతం ఏర్పడుతుందన్నారు. న్యాయ నిపుణులు, వివిధ తరగతులకు చెందిన మేధావుల అభిప్రాయాలు తీసుకోకుండా చట్టాలను మార్పు చేయడం తగదని చెప్పారు. కొత్త చట్టాల్లోని కొన్ని నిబంధనలు భావ ప్రకటన స్వేచ్ఛకు విఘాతం కలిగించేవిగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా వ్యతిరేక కొత్త క్రిమినల్ చట్టాలను వెంటనే రద్దు చేయాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. అసోసియేషన్ కార్యదర్శి ఆర్‌జీ కుమార్, సీనియర్ న్యాయవాదులు పోలిశెట్టి బాబ్జి, నల్లిమల్లి జోసఫ్, పూరిళ్ల శ్రీనివాస్, నెక్కంటి క్రాంతి, టి.సంతోష్‌కుమారి, తంగెళ్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కలల కోర్సులకు తొలి అడుగు

- ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ ప్రారంభం
- తొలిరోజు సర్వర్ల సమస్య
- అందుబాటులో కొత్త కోర్సులు
- ఉమ్మడి జిల్లాలో గతేడాది 10,140 సీట్లు
- ఈ ఏడాది అదనంగా మరో 10 శాతం సీట్లు
- అందుబాటులో హెల్ప్‌లైన్ కేంద్రాలు



ఏలూరు సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలోని హెల్ప్‌లైన్ కేంద్రం వద్ద ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న విద్యార్థులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యార్థుల కలల కోర్సులకు తొలి అడుగు పడింది. ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు ప్రారంభం కాగా ఈనెల 7 వరకు ఈ ప్రక్రియ కొనసాగనుంది. ఇదే సందర్భంగా విద్యార్థులు ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. విద్యార్థులు ఆన్‌లైన్‌లో సమర్పించిన వివరాలకు సంబంధించి సర్టిఫికెట్ల పరిశీలన ఈనెల 4 నుంచి మొదలు కానుంది. ఈనెల 8 నుంచి 12 వరకు విద్యార్థులు వెబ్ ఆప్షన్లు సమర్పించవచ్చు. 13న వెబ్ ఆప్షన్లలో మార్పులకు అవకాశం కల్పిస్తారు. ఈనెల 16న సీట్లను కేటాయించి 17 నుంచి 22 వరకు కళాశాలల్లో ప్రవేశాలు కల్పిస్తారు. ఈ క్రమంలో ఈనెల 19 నుంచి ఇంజినీరింగ్ కళాశాలల్లో తరగతులు ప్రారంభించాల్సి ఉందని ఉన్నత విద్యా మండలి సూచించింది.

ఆదిలోనే హంసపాదు

ఉత్సాహంగా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభం కాగా తొలిరోజు సర్వర్లు మొరాయించడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు ఒకేసారి రిజిస్ట్రేషన్‌కు ఉపక్రమించడంతో సర్వర్లు నిరాశకు గురిచేశాయి. గంటల తరబడి ప్రయత్నించినా రిజిస్ట్రేషన్లు కష్టసాధ్యమయ్యాయి. వాస్తవానికి విద్యార్థులు సీఈటీఎస్.ఏపీఎస్‌సీహెచ్ఈ.ఏపీ.జీఓవీ.ఐఎన్–24 అనే వెబ్‌సైట్‌లోకి వెళ్లి అడ్మిషన్ అనే ఆప్షన్‌పై క్లిక్ చేస్తే వచ్చే ఫారంలో హాల్‌టికెట్ నంబర్, పుట్టినతేదీ నమోదు చేస్తే రిజిస్ట్రేషన్ ఫాం ఓపెన్ అవుతుంది. అయితే ఎంతసేపు ప్రయత్నించినా రిజిస్ట్రేషన్ ఫారం తెరపై ప్రత్యక్షం కాలేదు. కొద్దిమందికి మాత్రమే రిజిస్ట్రేషన్ ఫారం ఓపెన్ కాగా పది, ఇంటర్ మార్కుల జాబితాలు, స్టడీ సర్టిఫికెట్లు, టీసీ, కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు, ఏపీ ఈఏపీసెట్‌లో సాధించిన ర్యాంకు కార్డులు, హాల్‌టికెట్, రేషన్ కార్డులను అప్‌లోడ్ చేసి రిజిస్ట్రేషన్ ముగించుకున్నారు.

అందుబాటులోకి కొత్త కోర్సులు

అంతర్జాతీయంగా ఇంజినీరింగ్ రంగంలో నూతన ఆవిష్కరణలు చోటుచేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో కొత్త కోర్సులు తెరపైకి వస్తున్నాయి. ఆర్టిఫీషియల్ ఇంటెలిజన్స్ (ఏఐ), మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్, రోబోటిక్స్, సైబర్ సెక్యూరిటీ, వెరీ లార్జ్‌స్కేల్ ఇంటిగ్రేషన్ డిజైన్, అడ్వాన్స్‌డ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ, ఏరోస్పేస్, మెరైన్, మైనింగ్, స్కిల్ అండ్ టెక్స్‌టైల్ వంటి బ్రాంచులు విద్యార్థులను ఆకర్షిస్తున్నాయి.

అప్రమత్తత అవసరం

రిజిస్ట్రేషన్ నుంచి ఆన్‌లైన్‌లో ఫీజులు చెల్లింపులు, కళాశాల, కోర్సుల ఎంపిక వంటి అంశాల్లో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి. ఆన్‌లైన్ సెంటర్లు, హెల్ప్‌లైన్ కేంద్రాల్లో ఆన్‌లైన్ చేయించుకునే సమయంలో పొరపాటు జరిగితే తాము ఎంచుకున్న కళాశాలలు, కోర్సులు దూరమయ్యే ప్రమాదం ఉంది. వివరాలన్నీ సరిచూసుకున్న తర్వాతే అప్లికేషన్‌ను సబ్మిట్ చేయడం ఉత్తమం.

ఏలూరు జిల్లాలో..

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 12 ఇంజనీరింగ్ కళాశాలలు ఉన్నాయి. ఏలూరు జిల్లాలో సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 1,020 సీట్లు, రామచంద్ర ఇంజనీరింగ్‌లో 900 సీట్లు, ఏలూరు ఇంజనీరింగ్‌లో 540 సీట్లు, హేలాపురి ఇంజనీరింగ్‌లో 360 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

పశ్చిమలో..

పశ్చిమగోదావరి జిల్లాలో భీమవరంలో విష్ణు ఇంజనీరింగ్ కళాశాలలో 1,020 సీట్లు, విష్ణు మహిళా ఇంజనీరింగ్‌లో 1,080 సీట్లు, ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్‌లో 1,020 సీట్లు, డీఎన్ఆర్ ఇంజనీరింగ్‌లో 720 సీట్లు, భీమవరం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో 420 సీట్లు ఉన్నాయి. తాడేపల్లిగూడెంలో వాసవి ఇంజనీరింగ్‌లో 1,020 సీట్లు, శశి ఇంజనీరింగ్ కళాశాలలో 1,020 సీట్లు, నరసాపురంలో స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో 1,020 సీట్లు ఉన్నాయి. మొత్తంగా ఉమ్మడి జిల్లాలో గతేడాది 10,140 సీట్లు ఉండగా ఈ ఏడాది మరో 10 శాతం సీట్లు పెరిగినట్టు తెలిసింది.

అందుబాటులో హెల్ప్‌లైన్ కేంద్రాలు

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ సమయంలో ఎదురయ్యే సందేహాలు, సమస్యల నివృత్తికి హెల్ప్‌లైన్ కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి. తణుకులోని ఎస్ఎంవీఎం పాలిటెక్నిక్ కళాశాల, విజయవాడ బెంజ్ సర్కిల్ వద్ద ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, రమేష్ హాస్పిటల్ సమీపంలోని ఆంధ్ర లయోలా కళాశాలల్లో హెల్ప్‌లైన్ కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులు తాము చేరదలచిన కళాశాలలకు వెళ్లినా ఆయా కళాశాలల యాజమాన్యాలు సైతం సొంతంగా హెల్ప్‌లైన్ కేంద్రాలను ఏర్పాటుచేశాయి.

రసాభాసగా పింఛన్ల పంపిణీ

ముసునూరు: ఏలూరు జిల్లా ముసునూరు మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ రసాభాసగా సాగింది. ఇంటికే వచ్చి పింఛన్ అందిస్తామని సీఎం చంద్రబాబు చెప్పిన మాటను టీడీపీ నేతలు పెడచెవిన పెట్టారు. సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ వర్కర్లతో కలిసి లబ్ధిదారుల ఇంటికే వెళ్లి పింఛన్ అందించాల్సి ఉండగా పలు ప్రాంతాల్లో సచివాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాల వద్దకు లబ్ధిదారులను రప్పించి సొమ్ములు అందించారు. గంటల తరబడి నిరీక్షణ అనంతరం లబ్ధిదారులకు పింఛన్ అందింది. ఇదిలా ఉండగా కొన్నిచోట్ల సర్వర్ పనిచేయకపోవడంతో పింఛన్‌దారులకు గంటల కొద్దీ నిరీక్షణ తప్పలేదు. పంపిణీ ప్రదేశాల్లో తెలుగుదేశం నాయకుల హడావుడి ఎక్కువగా కనిపించింది.

క్లుప్తంగా

తృటిలో తప్పిన ప్రమాదం



బొండాడ డ్రెయిన్‌లో తిరగబడిన పొక్లెయిన్

ఉండి: ఉండి బొండాడ డ్రెయిన్‌లో మేట వేసిన మట్టిదిబ్బలు తొలగిస్తుండగా.. పొక్లెయిన్ తిరగబడింది. డ్రెయిన్‌లో ఐరన్ పంటిని ఏర్పాటు చేసి దానిపై పొక్లెయిన్ పెట్టి పనులు ప్రారంభించేందుకు సిద్ధపడ్డారు. ఈ సందర్భంగా కొందరు టీడీపీ నాయకులు అత్యుత్సాహంగా ఫోటోలు దిగేందుకు పంటిపైకి ఒక్కసారిగా ఎక్కడంతో పంటి పక్కకు ఒరిగిపోయింది. నాయకులు కాలువలో పడిపోయారని అక్కడున్న వారంతా భావించారు. అయితే పొక్లెయిన్ డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో అందరూ నెమ్మదిగా పంటిపై నుంచి గట్టుకు చేరుకున్నారు. అనంతరం పంటి, పొక్లెయిన్ డ్రెయిన్‌లో బోల్తా కొట్టాయి.

వెండి వస్తువుల చోరీ



తాళం పగలగొట్టి తెరిచిన బీరువాలు

ముదినేపల్లి రూరల్: తాళం వేసిన ఇంట్లోకి దుండగులు చొరబడి బీరువా తాళాలు పగలగొట్టి వెండి వస్తువులు చోరీ చేశారు. ఈ ఘటన మండలంలోని కొరగుంటపాలెంలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన వెంట్రపాటి లవకుశరావు 15 రోజుల క్రితం ఇంటికి తాళాలు వేసి కుటుంబసభ్యులతో హైదరాబాద్‌లోని కుమారుడి ఇంటికి వెళ్లారు. కొద్దిరోజుల తరువాత పొరుగున ఉన్న శ్రీనివాసరావు అనే వ్యక్తి లవకుశరావు ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నట్లు గమనించి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. లవకుశరావు ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళాలు పగలగొట్టడంతో పాటు లోపల ఉన్న రెండు బీరువాలు దుండుగులు పగలగొట్టి వాటిలోని 1.5 కిలోల వెండి వస్తువులు చోరీ చేసినట్లు గుర్తించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వేధించిన కేసులో యువకుడిపై కేసు

కైకలూరు: ముగ్గురు కుమార్తెలతో ఒంటరిగా జీవిస్తున్న మహిళ పట్ల యువకుడు అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటనపై కైకలూరు రూరల్ స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గోనుపాడు గ్రామానికి చెందిన పెనుమాల కిరణ్మయి(33) భర్తతో విభేదాల కారణంగా కుమార్తెలతో కలసి జీవిస్తోంది. ఇదే గ్రామానికి చెందిన అవివాహితుడు సాలిమట్ల ఏసురాజు(25) ఆదివారం రాత్రి మహిళ దుకాణానికి వెళ్ళి వస్తోండగా అసభ్యకర సైగలతో వేధించాడు. దీనిపై కిరణ్మయి ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ టి.రామకృష్ణ కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

అనుబంధం.. శోభాయమానం

- శ్రీవారి క్షేత్ర అనుబంధ ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ
- ఉట్టిపడుతున్న శిల్పకళా వైభవం

ద్వారకాతిరుమల: పెచ్చులూడి కళావిహీనంగా కనిపించిన గోపురాలు.. పిచ్చి మొక్కలతో నిండిపోయిన ఆలయ పరిసరాలు.. ధూపదీప నైవేద్యాలకు కష్టతరంగా ఉన్న పరిస్థితులు ఇవీ ఒకప్పటి శ్రీవారి అనుబంధ ఆలయాల పరిస్థితి. ఇప్పుడు అవి దేదీప్యమానంగా వెలుగొందుతున్నాయి. ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయానికి అనుబంధంగా ఉన్న ఆలయాలు, వాటి విశిష్టత, అభివృద్ధిపై ‘సాక్షి’ ప్రత్యేక కథనం..

శ్రీవారి ఆలయానికి అనుబంధంగా 11 ఆలయాలు, 7 ఉపాలయాలు ఉన్నాయి. వీటి అభివృద్ధికి ఆలయ చైర్మన్ ఎస్వీ సుధాకరరావుతో పాటు దేవస్థానం అధికారులు కృషి చేస్తున్నారు. రాబడితో సంబంధం లేకుండా అభివృద్ధే ధ్యేయంగా ఉప, దత్తత ఆలయాలను తీర్చిదిద్దుతున్నారు. హిందూ మత అభివృద్ధికి పాటుబడుతున్నారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా అడుగులు ముందుకు వేస్తున్నారు.

ఉప, దత్తత దేవాలయాలు ఇవీ..

లక్ష్మీపురంలోని శ్రీ వేంకటేశ్వర సంతాన గోపాల జగన్నాథ స్వామి, మైలవరంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి, శ్రీ మల్లికార్జున స్వామి, శ్రీ ఆంజనేయ స్వామి, శ్రీ కోట మహాలక్ష్మమ్మ ఆలయాలు, అలాగే కొత్తనాగులూరు లోని శ్రీ కోదండరామస్వామి, రంగాపురంలోని శ్రీ భూ నీళా సహిత సత్యనారాయణ స్వామి, భట్లమగుటూరులోని శ్రీ రామ, వేంకటేశ్వరస్వామి, ఐఎస్ జగన్నాథపురంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి, ఏలూరు శనివారపుపేటలోని శ్రీ చెన్నకేశవ, రామలింగేశ్వర స్వామి, ఏలూరు తూర్పువీధిలోని శ్రీ సంతాన వేణుగోపాల స్వామి ఆలయాలు దత్తత ఆలయాలుగా ఉన్నాయి. ద్వారకాతిరుమలలోని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి, శ్రీ కుంకుళ్లమ్మ అమ్మవారు, శ్రీ ఆంజనేయ స్వామి, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, భీమడోలు లోని శ్రీ వేంకటేశ్వర స్వామివారి రూపక దేవాలయం, తూర్పు యడవల్లిలోని శ్రీ సీతారామచంద్రస్వామి, రంపచోడవరం లోని శ్రీ రంప శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయాలు ఉపాలయాలుగా ఉన్నాయి.

లక్ష్మీపురంలో..

లక్ష్మీపురంలోని శ్రీ వేంకటేశ్వర సంతాన గోపాల జగన్నాథ స్వామి ఆలయాన్ని 130 ఏళ్ల క్రితం పూరీకి చెందిన మంత్రరత్నం అమ్మాజీ నిర్మించారు. అందులో వేంకటేశ్వర స్వామి, జగన్నాథస్వామిని ప్రతిష్ఠించారు. ఏటా పూరీలో వలె రథయాత్ర ఉత్సవాలను జరుపుతున్నారు. శ్రీవారి దేవస్థానం ఈ ఆలయాన్ని దత్తత తీసుకుని, జీర్ణోద్ధరణ గావించి మరింత అభివృద్ధి చేసింది.



ఏలూరు శనివారపుపేటలోని శ్రీ చెన్నకేశవ, రామలింగేశ్వర స్వామి ఆలయ గాలిగోపురం

మైలవరంలో..

మైలవరంలో వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వర స్వామి, శ్రీ మల్లికార్జున స్వామి, శ్రీ ఆంజనేయ స్వామి ఆలయాలు ఎంతో ప్రసిద్ధి చెందాయి. క్రీస్తు శకం 1313లో సూరానేని వంశోద్భవులు రాజా లక్ష్మీరాయన ప్రభువుల ఆదేశానుసారం, వారి పరిపాలనలోని చెలికాని జానయ్య అనే కృష్ణ భక్తుడు శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాలు జరిపేందుకు మండపాన్ని నిర్మించినట్టు చెబుతారు. పార్వేటి మండపాన్ని క్రీస్తు శకం 1322 లో నిర్మించినట్టు అక్కడున్న శిలా శాసనాల ద్వారా తెలుస్తోంది. ఆంజనేయ స్వామివ ఆలయాన్ని 1992లో జీర్ణోద్ధరణ చేయగా.. శ్రీ కోట మహాలక్ష్మీ అమ్మవారి ఆలయాన్ని 2011 ఫిబ్రవరిలో పునర్నిర్మించారు. కొత్తనాగులూరు లోని శ్రీ కోదండరామస్వామి ఆలయాన్ని శ్రీ రాజా వేంకట నారాయణరావు బహద్దూరు జమీందారు భూమి దానంగా ఇచ్చి నిర్మింపచేశారు.

రంగాపురంలో..

లింగపాలెం మండలం, రంగాపురంలోని శ్రీ భూ నీలా సహిత సత్యన్నారాయణ స్వామివారి ఆలయం కీర్తి శేషులు రుద్రవరపు వెంకట రామకృష్ణ శర్మ, కామేశ్వరమ్మ దంపతుల సాయంతో నిర్మించారు. పెనుమంట్ర మండలం భట్లమగుటూరులోని శ్రీ రామ, వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని 2005లో రిటైర్డ్ జడ్జి రామస్వామి నిర్మించారు.



లక్ష్మీపురంలోని శ్రీ వేంకటేశ్వర సంతాన గోపాల జగన్నాథ స్వామి ఆలయం



రంగాపురంలోని శ్రీ భూ నీలా సహిత సత్యనారాయణ స్వామివారి ఆలయం

ఐఎస్ జగన్నాథపురంలో..

ఐఎస్ జగన్నాథపురంలో 1995లో తమిళనాడుకు చెందిన శ్రీధర్ గురూజీ, హైదరాబాద్‌కు చెందిన ఆయన ప్రధాన శిష్యుడు కొచ్చెర్లకోట నరసింహ గురూజీలు ఆలయ ఆవరణలో కనకవల్లీ దేవి అమ్మవారి విగ్రహాన్ని, అష్ట దిక్కులలో 8 మండపాలను ఏర్పాటు చేశారు. ప్రతి ఏటా నరసింహ గురూజీ మహా శివరాత్రి పర్వదినం నాడు మహా సుదర్శన యాగాన్ని నిర్వహిస్తున్నారు.

ఏలూరులో..

నూజివీడు జమిందారు రాజా మేకా ధర్మ అప్పారావు ఏలూరు శనివారపుపేటలో శ్రీ చెన్నకేశవ, రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించి, విగ్రహ ప్రతిష్ఠ చేశారు. రాజావారి వంశంలోని ధర్మ అప్పారావు కోడళ్లు రాణి చెన్నామ్మారావు బహద్దూర్, రాణి పాపామ్మారావు బహద్దూర్ 100 అడుగుల ఎత్తున శిల్పకళా వైభవంతో గాలిగోపురాన్ని కట్టించారు. 200 సంవత్సరాలకు ముందు కట్టిన గోపురం కావడంతో ఆ శిల్పాలు శిథిలావస్థకు చేరాయి. ఈ ఆలయాన్ని కాపాడాలనే మంచి ఉద్దేశ్యంతో మైలవరం జమిందారు, శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానం ధర్మకర్తలు సూరానేని వేంకట సుధాకరరావు బహద్దూర్ ద్వారకాతిరుమల దేవస్థానానికి దత్తత తీసుకున్నారు. దెబ్బతిన్న గాలి గోపురాన్ని, వాటిపైన శిల్ప సంపదను రక్షించే విధంగా చర్యలు చేపట్టారు. సూరన్న పంతులకు జొన్న పాత్రలో స్వయంభూగా దర్శనమిచ్చి లభించిన దేవుడు శ్రీ సంతాన వేణుగోపాల స్వామివారు. స్వామివారు ధర్మఅప్పారావుకు కలలో దర్శనమిచ్చారు. వెతుక్కుంటూ వచ్చిన ఆయనకు ఏలూరు తూర్పువీధిలో కొలువై దర్శనమిచ్చారు. ధర్మా అప్పారావు ఈ ఆలయాన్ని నిర్మించారు. నాటి ఈ దేవాలయాన్ని ద్వారకాతిరుమల దేవస్థానం దత్తత తీసుకుని 2008లో పునఃనిర్మించింది.



ఐఎస్ జగన్నాథపురం లోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారి ఆలయం

ఆలయాల అభివృద్ధికి కృషి



రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల్లో ఒకటైన ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంతో పాటు, అనుబంధ ఆలయాల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నాం. చరిత్ర కలిగిన దేవాలయాల పరిరక్షణకు అన్ని చర్యలు చేపడుతున్నాం. అలాగే ఉప, దత్తత ఆలయాల్లో పూజాది కార్యక్రమాలను వైభవంగా నిర్వహిస్తున్నాం. భక్తులకు అన్ని సౌకర్యాలను సమకూరుస్తున్నాం.

వేండ్ర త్రినాథరావు, శ్రీవారి దేవస్థానం ఈఓ

ఆర్చరీ పోటీల్లో జాతీయ స్థాయికి ఎంపిక



తణుకులో జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో డైరెక్టర్ ప్రకాశరావు

తణుకు అర్బన్: ఆర్చరీ పోటీల్లో తణుకు మాంటిస్సోరీ విద్యార్థులు సత్తా చాటినట్లు స్కూలు డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు తెలిపారు. గతనెల 22 నుంచి 24 వరకు కృష్ణా జిల్లా విజయవాడలో ఆంధ్రప్రదేశ్ ఆర్చరీ అసోసియేషన్, జిల్లా ఆర్చరీ అసోసియేషన్, చెరుకూరి జిల్లా అర్చరీ అసోసియేషన్ నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ 14వ మిని అండర్ 13 (ఓపెన్), 6వ కిడ్స్ అండర్ 9 (ఓపెన్) అంతర్ జిల్లా రాష్ట్ర స్థాయి ఆర్చరీ చాంపియన్ షిప్ పోటీల్లో స్టేట్ లెవల్ అండర్ 10 కేటగిరీల్లో 4వ తరగతి విద్యార్థిని కర్రి కోమలి స్పందనారెడ్డి కాంపౌండ్‌లో 2వ స్థానం, 2వ తరగతి విద్యార్థిని ఆళ్ల శారద కాంపౌండ్‌లో 6వ స్థానం, స్టేట్ లెవెల్ అండర్ 10 ఇండియన్ రౌండ్‌లో 4వ తరగతి విద్యార్థి సీహెచ్ హర్షద్ 4వ స్థానం, స్టేట్ లెవెల్ అండర్ 15కు సంబంధించి 9వ తరగతి విద్యార్థిని ఎస్.హంసిని రికర్వ్ రౌండ్, స్టేట్ లెవెల్ అండర్ 13 కాంపౌండ్ రౌండ్‌లో 6వ తరగతి విద్యార్థిని కె.సమీక్షారెడ్డి రెండో స్థానం సాధించి వెండి పతకాలు సాధించినట్లు వివరించారు.

శ్రీవారి సేవలో కలెక్టర్ వెట్రిసెల్వి



శ్రీవారి ఆలయంలో కలెక్టర్ వెట్రిసెల్వికి మెమెంటోను అందజేస్తున్న డీఈఓ బాబురావు

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకా తిరుమల చినవెంకన్న ఆలయాన్ని జిల్లా నూతన కలెక్టర్ వెట్రిసెల్వి సోమవారం రాత్రి సందర్శించారు. ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన తరువాత తొలి సారిగా ఆలయానికి కుటుంబ సమేతంగా విచ్చేసిన ఆమెకు ముందుగా దేవస్థానం అధికారులు, అర్చకులు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆమెకు పట్టు వస్త్రాలు అందించి, వేద ఆశీర్వచనాన్ని పలుకగా, ఆలయ డీఈవో బాబురావు శ్రీవారి మెమెంటోను, ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓలు మెట్టపల్లి దుర్గారావు, పి.నటరాజారావు, ఆర్ఐ నాగరాజు తదితరులున్నారు.

నిర్వాసితుల సమస్యలపై పోలవరం పర్యటన

ఏలూరు (టూటౌన్): ఈ నెల 4,5 తేదీలలో పోలవరం నిర్వాసితుల సమస్యలపై రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల రాష్ట్ర నాయకుల బృందం పర్యటిస్తున్నట్లు ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏ.రవి, జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, ఏపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్‌లు చెప్పారు. స్థానిక పవరుపేటలోని అన్నే భవనంలో రైతు,వ్యవసాయ ఆకర్మిక సంఘాల జిల్లా నాయకుల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 4వ తేదీన వేలేరుపాడు మండలం రేపాక గొమ్ము, కుక్కునూరు మండలం కివ్వాక, చీరపల్లి మాధవరం, 5వ తేదీన జీలుగుమిల్లి మండలంలోని నిర్వాసిత కాలనీలు, జంగారెడ్డిగూడెం మండలంలోని చల్లవారి గూడెం నిర్వాసిత కాలనీలో రాష్ట్ర నాయకులు పర్యటన చేసి సమస్యలపై అధ్యయనం చేస్తారన్నారు. పోలవరం నిర్వాసిత ప్రాంతాలలో జరుగుతున్న ఈ పర్యటనలో నిర్వాసితులు తమ సమస్యలను వివరించేందుకు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అభ్యసనా సామర్థ్యాలు మెరుగుపర్చాలి

భీమడోలు: తరగతి గదిలో అభ్యసనా నైపుణ్యాలను పెంపొందించడమే టీచ్ టూల్ లక్ష్యమని జిల్లా ఇంచార్జి ఏఎంవో ఆర్.రామారావు అన్నారు. భీమడోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో సమగ్ర శిక్షా అభియాన్, రాష్ట్ర విద్యా పరిశోధనా సంస్థల ఆధ్వర్యంలో 9 రోజుల పాటు జరిగే సపోర్టింగ్ ఆంధ్ర లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ సహకారంతో టీచ్ టూల్ శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు, గణపవరం, ద్వారకాతిరుమల మండలాల నుంచి ఎంపికైన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఎంఎంటీలకు శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంఈవో 1 ఈడుపల్లి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా ఇంచార్జి ఎఎంవో ఆర్.రామారావు, దీక్ష కోఆర్డినేటర్, నోడల్ అధికారి శ్రీహరిలు హాజరయ్యారు. కోర్స్ డైరెక్టర్ ఎంఈవో 1 ఏ.భాస్కర్‌కుమార్ టీచ్ టూల్ కార్యక్రమ లక్ష్యాలను వివరించారు. కోర్సు మాస్టర్ ట్రైనర్స్‌గా షేక్ మస్తాన్, ఎస్.పెద్దిరాజులు వ్యవహరించారు. తరగతి అభ్యసన ప్రక్రియను పరిశీలించడం, నమోదు చేయడం, అభ్యసనా ప్రక్రియను మెరుగుపర్చడం, ఉపాధ్యాయునికి అభ్యసనా ప్రక్రియలో చేయవలసిన, చేసుకోవాల్సిన మార్పులు గురించి వారికి శిక్షణ అందించారు. ఆర్.రామారావు మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థి అని, బోధనా నైపుణ్యాలను పెంపొందించుకోవడం పాటు విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు తెలుసుకునేందుకు ఈ శిక్షణ దోహద పడుతుందన్నారు.



భీమడోలులో ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న ఏఎంవో ఆర్.రామారావు తదితరులు

డయేరియాపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ ఎస్.శర్మిష్ట తదితరులు

ఏలూరు(టూటౌన్): స్టాప్ డయేరియా క్యాంపెయిన్ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ ఎస్.శర్మిష్ట ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నుంచి సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ శర్మిష్ట మాట్లాడుతూ జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకు రెండు నెలల పాటు జిల్లా వ్యాప్తంగా స్టాప్ డయేరియా క్యాంపెయిన్ నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా జూలై 1 నుంచి ఓఆర్ఎస్ ప్యాకెట్‌లు పంపిణీ చేస్తామని, తల్లికి అతిసారపై అవగాహన కల్పించుట, ఏఎస్ఎం, ఆశా, ఎంఎల్‌హెచ్‌పిల ద్వారా గృహ సందర్శనలో భాగంగా అతిసార లక్షణాలు కనుక్కుంటామన్నారు. ఎవరికైనా అతిసార వ్యాధి లక్షణలు ఉంటే వారికి 14 రోజులు పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్స్, జింక్ టాబ్లెట్స్ అందిస్తామని, ఎంఎల్‌హెచ్‌పిలతో హెల్త్ వెల్‌నెస్ సెంటర్లలో ఓఆర్ఎస్, జింక్ టాబ్లెట్స్ అందుబాటులో ఉంచుతామన్నారు. హెల్త్ వెల్‌నెస్ సెంటర్ల పరిధిలోని అన్ని పాఠశాలల్లోని బడి పిల్లలకు హ్యాండ్ వాష్,పరిశుభ్రత గురించి అవగాహన కల్పించి అతిసార ప్రబలకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఎంఎల్‌హెచ్‌పిలచే నీటి యొక్క నాణ్యతను పరీక్షించుట, నీటిలో నాణ్యత లోపించిన యెడల పంచాయతీ సిబ్బందితో క్లోరినేషన్ చేయించుట ద్వారా సురక్షిత నీరు అందేలా చూడాలన్నారు. డెంగ్యూ, మలేరియా వ్యాధుల గురించి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ ఎం.నాగేశ్వరరావు,ప్రోగ్రామ్ ఆఫీసర్స్,పలువురు డాక్టర్లు,డిప్యూటీ డిఈఎంఓ,జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం సిబ్బంది, ఏఎస్ఎంలు,ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

నరసాపురం బస్టాండ్‌లో భారీ చోరీ

- రూ.11 లక్షల నగదు, 400 గ్రాముల బంగారం అపహరణ
- పోలీసులకు ఫిర్యాదు చేయని వైనం

నరసాపురం: రాజస్తాన్‌కు చెందిన నగల వ్యాపారి వద్ద పనిచేసే గుమస్తా సోమవారం నరసాపురం బస్టాండ్‌లో రూ.11 లక్షల నగదు, 400 గ్రాముల బంగారంతో ఉన్న బ్యాగ్‌ను పోగొట్టుకున్నట్టు తెలిసింది. ఈ చోరీపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడం విశేషం. నరసాపురంలో పెద్ద ఎత్తున బంగారం వ్యాపారం చేస్తుంటారు. గోల్డ్‌షాపుల వద్దకు కలెక్షన్స్ నిమిత్తం రాజస్తాన్, ముంబయి ప్రాంతాల నుంచి ఏజెంట్లు వస్తుంటారు. కలెక్షన్ చేసుకుని భీమవరం వెళ్లే ప్రయత్నంలో ఓ ఏజెంట్ నుంచి నగదు, బంగారం చోరీకి గురైందని చెబుతున్నారు. సాయంత్రం 4 గంటల సమయంలో అప్పుడే వచ్చిన భీమవరం బస్సులో సీటు నిమిత్తం ఏజెంట్ నగదు, బంగారు ఉన్న బ్యాగ్‌ను వేసి బస్సు ఎక్కి చూసే సరికి కనిపించలేదని చెబుతున్నారు. ఈ ఘటన అనేక అనుమానాలకు తావిస్తోంది. నగదు, బంగారం ఉన్న బ్యాగ్‌ను అంత నిర్లక్ష్యంగా సీటు కోసం ఎలా వేశాడనే ప్రశ్నలు తలెత్తున్నాయి. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని టౌన్ సీఐ తెలిపారు. రోజూ వందల కోట్లలో నరసాపురంలో జరిగే బంగారం వ్యాపారంలో ఇలాంటి సంఘటనలు గతంలో అనేకం జరగడం, పోలీసులకు చాలా సందర్భాల్లో ఫిర్యాదులు చేయకపోవడం లాంటివి గతంలో జరిగాయి. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఆకట్టుకున్న కోలాట ప్రదర్శన



చిన్న వెంకన్న బృందం కోలాట ప్రదర్శన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ఏలూరు చిన్న వెంకన్నకు చెందిన బృందం సోమవారం ప్రదర్శించిన కోలాటం భక్తులను ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదిక వద్ద సోమవారం సాయంత్రం కళాబృందానికి చెందిన పలువురు చిన్నారులు, మహిళలు అమ్మవారి పాటలు, కీర్తనలకు లయబద్ధంగా కోలాటాన్ని ప్రదర్శించారు. బుజ్జి.. బుజ్జి.. గణపయ్య.., గోగులో.. గోగుల్లో.., లేలేవయ్యా అంజనస్వామి అంటూ పలు కీర్తనలను ఆలపించారు. కీర్తనలకు తగినట్లుగా బృందంలోని సభ్యులు కోలాటం ఆడగా, భక్తులు వీక్షించారు. అనంతరం బృందంలోని సభ్యులకు అమ్మవారి దర్శనం కల్పించగా, ఆలయ ఈఓ కేఎస్ రామారావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

సరైన పోషణతో అధిక పాల దిగుబడి

రైతులకు అవగాహన కల్పిస్తున్న పశు సంవర్ధక శాఖ

భీమవరం అర్బన్: వ్యవసాయంతో పాటు అనుబంధంగా పాడి పశువుల పోషణ మంచి ఆదాయ వనరు. అయితే పాడి పశువుల పెంపకంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే ఒక్కోసారి నష్టాలు వాటిల్లతాయి. పశువులు జబ్బుల బారిన పడకుండా ఉండాలంటే అనేక జాగ్రత్తలు తీసుకోవాలి. వాటికి సరైన పోషకాహారం అందజేయాలని భీమవరం మండల పశు వైద్యాధికారి పి.పుండరీబాబు సూచిస్తున్నారు.

రోగనిరోధక శక్తి పెరగడానికి..

పశువుల ఎదుగుదలకు, రోగనిరోధక శక్తికి మాంసకృత్తులు ఎంతో అవసరం, ఇవి ఆహారంలో లోపిస్తే పశువులు చిక్కిపోవడం, పెరుగుదల స్తంభించడం, అండాశయం చిన్నగా ఉండటం, ఆలస్యంగా యుక్త వయసుకు రావడం, వ్యాధి నిరోధక శక్తి తగ్గడం, కండరాల బలహీనత వంటి సమస్య ఉత్పన్నమవుతాయి. పత్తి గింజలు, కొబ్బరి పిండి, వేరుశనగ పిండి, నువ్వుల పిండి, చేపల పొడి వంటివి, పప్పు జాతికి చెందిన పశుగ్రాసాల్లో మాంసకృత్తులు, విటమిన్లు సమృద్ధిగా లభిస్తాయి.

కొవ్వు పదార్థాలు తప్పనిసరి

పశువుల శరీరంలో కొవ్వు నిల్వలు అంతర్గత అవయవాలను దెబ్బల నుంచి కాపాడతాయి. శరీర ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరిస్తాయి. ఆహారంలో రుచిని పెంపొందిస్తాయి. పశువుల సక్రమ పునరుత్పత్తిలో మాంసకృత్తుల కంటే కొవ్వు అందించే శక్తి ముఖ్యమైంది. కొవ్వు, పిండి పదార్థాల కన్నా రెండున్నరెట్లు అధిక శక్తినిస్తాయి. ఒక గ్రాము కొవ్వు పదార్థం సుమారు 9 కిలోల క్యాలరీల ఉష్ణశక్తిని అందిస్తుంది. వేరుశెనగ పిండి, కొబ్బరిపిండి, నూనె గింజల చెక్క, గోధుమ తవుడు, వరి తవుడులో కొవ్వు పదార్థాలు ఎక్కువగా ఉంటాయి.



ఫొటోఫైల్29బివిఆర్ఎమ్‌యుఆర్‌భీ151-290015:

రోజుకు 50 నుంచి 60 లీటర్లు అవసరం

పశువులు నీరు లేకుండా ఐదు రోజులకు మించి బతకలేవు. ఆహారంలోని వివిధ పోషక పదార్థాలను సంగ్రహించడానికి పోషక పదార్థాలు, విటమిన్లు, ఖనిజ లవణాలు శరీరంలోని వివిధ భాగాలకు చేర్చడానికి, శరీర ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరించడానికి, జీర్ణక్రియలో ఉపయోగపడే కొన్ని ఎంజైముల తయారీకి, వ్యర్థ పదార్థాల విసర్జనకు నీరు దోహదపడుతుంది. శరీరంలోని మాంసకృత్తులు, కొవ్వు పదార్థాలు, పిండిపదార్థాల ఆక్సిడేషన్ వల్ల కూడా అర లీటరు నుంచి లీటరు వరకు నీరు ప్రతి పోషక పదార్థం నుంచి లభ్యమవుతంది. శరీరంలో నీరు తక్కువైతే చర్మం పొడిగా మారడం, మూత్ర సంబంధ వ్యాధులు, అజీర్తి, మలబద్ధకం తదితర సమస్యలు ఉత్పన్నమవుతాయి. పశువులు డీహైడ్రేషన్‌కు గురవుతాయి. పశువుకు రోజుకు 50 నుంచి 60 లీటర్ల వరకు నీరు అవసరం.

సరైన పోషణతోనే అధిక పాల ఉత్పత్తి

పశువులకు పచ్చి, ఎండు గ్రాసంతో పాటుగా పత్తి గింజలు, కొబ్బరి పిండి, వేరుశనగ పిండి, నువ్వుల పిండి, చేపల పొడి వాటిని దాణాగా పెడితే అవి వ్యాధినిరోధక శక్తితో బలంగా ఉంటాయి. దీంతో పాల దిగుబడి ఎక్కువగా ఉంటుంది. పాడి పోషణపై రైతులతో పాటు పశుపెంపకందారులకు అవగాహన కల్పిస్తున్నాం.

పి. పుండరీబాబు, పశు వైద్యాధికారి, భీమవరం మండలం

క్లుప్తంగా

ఘనంగా మహంకాళమ్మ వార్షికోత్సవాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక ఏలూరు రోడ్డులో శ్రీదేవి మహంకాళమ్మ తల్లి నూతన ప్రతిరూప ఆలయం ఆరోవ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, అష్టలక్ష్మి నవదుర్గ హోమం, విశేష పూజలు జరిగాయి. భారీ అన్నసమారాధన నిర్వహించారు. నవదోయ ఫ్రెండ్స్ యూనియన్ అధ్యక్షుడు యెగ్గిన నాగబాబు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

తాడేపల్లిగూడెం రూరల్: సీజనల్ వ్యాధుల పై ప్రజల్ని అప్రమత్తం చేయాలని పెదతాడేపల్లి సర్పంచ్ పోతుల అన్నవరం అన్నారు. సోమవారం మండలంలోని పెదతాడేపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అన్నవరం మాట్లాడుతూ మంచినీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేయాలన్నారు. సురక్షితమైన మంచినీటిని కుళాయిల ద్వారా సరఫరా చేయాలన్నారు. అనంతరం అజెండాలోని అంశాలపై చర్చించారు. ఉప సర్పంచ్ అత్తింటి సోమరాజు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

కవి ప్రసాద్‌కు పురస్కారం



కవి ప్రసాద్‌ను ఘనంగా సత్కరిస్తున్న నిర్వాహకులు

తణుకు: అంతర్జాతీయ సాహితీ సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఈనెల 30న సూర్యాపేటలో నిర్వహించిన 136వ జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో తణుకు పట్టణానికి చెందిన కవి వీఎస్‌వీ ప్రసాద్ పురస్కారం అందుకున్నారు. కవి ప్రసాద్ రచించి, వినిపించిన అంతర్గత శరీర రక్షకులు అనే కవితకు విశేష స్పందన లభించింది. వేదిక అంతర్జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కత్తిమండ ప్రతాప్, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు పోతుగంటి వీరాచారి, మహిళా అధ్యక్షురాలు పూసోజు పద్మ, జ్వాలాగిరీష జి.ఈశ్వరిభూషణం, నాగేశ్వరం శంకర్ చేతుల మీదుగా పురస్కారం అందజేసి ఘనంగా సత్కరించారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తాడేపల్లిగూడెం రూరల్: ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు 50 ఏళ్లకు పింఛన్ పథకం వర్తింపజేయాలని ఇఫ్టూ డివిజన్ ప్రధాన కార్యదర్శి మామిడి దానవరప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని మోదుగ గుంట గ్రామంలో ఇఫ్టూ జనరల్‌బాడీ సమావేశం కే.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా దానవరప్రసాద్ మాట్లాడుతూ ప్రమాదం, వివాహ కానుక, బీవోసీ బోర్డు పథకాలను అమలు చేయాలన్నారు. ఉచిత ఇసుక సరఫరా చేయాలని, బిల్డింగ్ మెటీరియల్ ధరలు తగ్గించాలని, భవన నిర్మాణకార్మికులకు ఉపాధి కల్పించాలన్నారు. నిరుద్యోగ యువతకు పింఛన్ అమలు చేయాలన్నారు. కే.శ్రీనివాస్, పెదగాడి వీరబ్రహ్మం, కే.పోసేంద్రప్రసాద్, అంగర రాంబాబు, పెనుగుర్తి వీరబాబు, సత్యనారాయణ, నాగు, రాము పాల్గొన్నారు.

లయన్స్ సేవలు మరువలేనివి



డైమండ్స్ నూతన కమిటీ కార్యవర్గంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్ సేవలు మరువలేనివని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక బుద్దాల కన్వెన్షన్ హాల్‌లో సోమవారం తాడేపల్లిగూడెం డైమండ్స్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా జరిగింది. జిల్లా నూతన గవర్నర్ కాకరాల వేణుబాబు ముఖ్యఅతిథిగా హాజరైయారు. మొదటి గవర్నర్ ఎన్‌వీవీఎస్ పాపారావు నాయుడు క్లబ్ సభ్యులతో ప్రమాణం చేయించారు. రెండోవ గవర్నర్ డాక్టర్ డి.సుబ్బారావు నూతన సభ్యులకు విధులు తెలియజేశారు. పిన్స్ అందజేశారు. క్లబ్ సేవలను విస్తృతం చేస్తామన్నారు. అధ్యక్షుడు కొప్పిశెట్టి రమణయ్య, కార్యదర్శిగా మద్దుకూరి మోహర్ ప్రసాద్, ట్రెజరర్‌గా కాళ్ల గోపి, అడ్మినిస్ట్రేటర్‌గా పేరిచర్ల మురళీకృష్ణంరాజు, ఉపాధ్యక్షులుగా వేగేశ్న రామరాజు, బోళ్ల రాము, కోటి విజయ్, కిషోర్, ధర్మారావు, లంకా శ్రీనివాస్, చెన్నారెడ్డి సతీష్, వివిధ చైర్మన్‌లు, వివిధ విభాగాల సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. పదం కుమార్ గుప్తా, ఎన్‌వీ రమణారావు తదితరులకు సన్మానం జరిపి జ్ఞాపికలు అందజేశారు.

ఉపాధి కూలీలకు బకాయి వేతనాలు ఇవ్వాలి

తణుకు: ఉపాధి హామీ కార్మికులకు బకాయి వేతనాలను తక్షణమే చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్, ఎంపీడీవోలకు వినతి పత్రాలను అందజేశారు. అనంతరం ప్రతాప్ మాట్లాడుతూ ఉపాధి హామీ కార్మికులకు గత ఏప్రిల్ నుంచి చేసిన పనులకు వేతనాలు ఇవ్వకపోతే ఎలా బతుకుతారని ప్రశ్నించారు. సీపీఎం నాయకులు గార రంగారావు, గుబ్బల గోపి, పి.రాజా పాల్గొన్నారు.

దోమకాటు.. ఆరోగ్యానికి చేటు



పెంటపాడు ప్రభుత్వ పాఠశాలలో చిన్నారులను వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం



పెంటపాడు మండలంలో గ్రామంలో పేరుకుపోయిన చెత్త, చెదారం

- కొనసాగుతున్న మలేరియా మాసోత్సవాలు
- గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు

పెంటపాడు: వర్షాలు కురవడంతో సీజన్ వ్యాధులు ప్రభలే అవకాశం ఉంది. ప్రపంచవ్యాప్త ఆరోగ్య సమతుల్యత సాధించేందుకు ప్రధానంగా మలేరియాపై వ్యతిరేక పోరాటం ముమ్మరంగా జరుగుతోంది. ఈ సందర్భంగా ఆరోగ్య కార్యకర్తలు ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జాతీయ కీటకజనిత వ్యాధి నియంత్రణ కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టారు. వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో వైద్య తనిఖీలు చేపడుతున్నారు. గ్రామాల్లో ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు వివరిస్తున్నారు. నిల్వనీటిలో దోమలు వృద్ధి చెందకుండా నివారణ మందులను స్ప్రేచేయాలని సూచనలు ఇస్తున్నారు. గుంబూషియా చేపలను వదలడం ద్వారా దోమల లార్వాలను అరికట్టవచ్చని సూచిస్తున్నారు. ఇళ్లలోని గోడలపై సింథటిక్ ఫెరిత్రాయిడ్ అవసరాన్ని బట్టి దోమల మందులను స్ప్రే చేయాలని అవగాహన కల్పిస్తున్నారు. దోమ తెరలు, దోమ చక్రాల ద్వారా దోమల నుంచి రక్షణ పొందవచ్చని సూచిస్తున్నారు.

మలేరియా లక్షణాలు:
చలి, వణుకుతో పాటు, జ్వరం, అనాఫిలిస్ దోమల ద్వారా వ్యాపిస్తుందని చెబుతున్నారు. ప్లాస్మోడియా జాతికి చెందిన రెండు క్రిముల వల్ల మలేరియా వ్యాప్తి చెందుతుందని పేర్కొంటున్నారు. దీనిలో వైవాక్ మలేరియా తక్కువ బాధిస్తే, పాల్సీఫారం మలేరియా ఎక్కువ బాధించడమే కాకుండా కొన్ని సందర్భాలలో ప్రాణాంతకమవుతుందని వైద్యులు సూచిస్తున్నారు. దోమ కుట్టిన 8 నుంచి 12 రోజుల్లో వ్యాధిలక్షణాలు బయట పడతాయి. చిన్నారులకు, గర్భిణులకు ఈ వ్యాధి ప్రమాదకరమైనది. రక్త పరీక్షల ద్వారా ఈ వ్యాధిని నిర్ధారించవచ్చన్నారు.

పరిసరాల శుభ్రత పాటించాలి



మలేరియా వ్యాధి అనాఫజలిస్ అనే ఆడ దోమ ద్వారా వ్యాప్తి చెందుతుంది. మలేరియా వ్యాధి స్థానిక వాతావరణ పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. ఈ వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే డాక్టర్లను సంప్రదించాలి. రక్తమార్పిడి సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోవాలి . ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకుండా డాక్టర్ల సూచనలు పాటించాలి.

– తోట రాజేష్, పెంటపాడు ప్రాథమిక వైద్యాధికారి

యువకుడిపై దాడి కేసులో డీఎస్పీ విచారణ



కొమరవరంలో విచారణ చేస్తున్న డీఎస్పీ మూర్తి

తణుకు: తణుకు మండలం కొమరవరం గ్రామంలో ఇటీవల యువకుడిపై దాడిచేసి తీవ్రంగా గాయపరచిన ఘటనపై తాడేపల్లిగూడెం డీఎస్పీ డీఎస్ఆర్‌వీఎస్ఎన్ మూర్తి సోమవారం విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన మేడే రామూర్తి బైక్‌పై వెళుతుండగా అదేగ్రామానికి చెందిన ముత్యాల సుబ్బారావు, ముత్యాల సాయిలు గత నెల 26న దారి కాచి అడ్డగించి తీవ్రంగా గాయపర్చారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన రామ్మూర్తి తణుకులోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సంఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తణుకు రూరల్ ఎస్సై కె.చంద్రశేఖర్ నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీకేసు నమోదు చేయగా డీఎస్పీ మూర్తి విచారణ చేపట్టారు. ఈ మేరకు సోమవారం సంఘటన జరిగిన ప్రాంతాన్ని ఆయన పరిశీలించి స్థానికులనుంచి వివరాలను అడిగితెలుసుకున్నారు. యువకుడిపై దాడి చేసిన నింధితులను త్వరలోనే అరెస్ట్‌చేసి, చట్టపరంగా చర్యలు తీసుకుంటామని డిఎస్పీ మూర్తి వెల్లడించారు. ఆయన వెంట తణుకు రూరల్ సీఐ జీవీవీ నాగేశ్వరరావు, ఎస్ఐ కె.చంద్రశేఖర్, ఏఎస్ఐ అంజిబాబు, సిబ్బంది ఉన్నారు.

పింఛన్ల పంపిణీ



తణుకు: వేల్పూరు గ్రామంలో లబ్ధిదారులకు పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే రాధాకృష్ణ



తాడేపల్లిగూడెం రూరల్: కృష్ణాయపాలెం గ్రామంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

తణుకు, తణుకు టౌన్: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చే దిశగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. తణుకు నియోజకవర్గంలోని సోమవారం తణుకు పట్టణంతోపాటు వేల్పూరు, రేలంగి, అత్తిలి గ్రామాల్లో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేశారు. సోమవారం ఒక్క రోజులోనే తణుకు నియోజకవర్గంలో 34,848 మంది లబ్ధిదారులకు రూ. 24.66 కోట్లు పంపిణీ చేశారన్నారు. జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అత్తిలి: చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నారని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. సోమవారం అత్తిలి శివారు గోగులమ్మపేటలో ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లను ఆయన పంపిణీ చేశారు. సర్పంచ్ గంటావిజేత నాగరాజు, ఇన్‌ఛార్జ్ ఎంపీపీ సుంకర నాగేశ్వరరావు, టీడీపీ, జనసేన, బీజేపీ మండలాధ్యక్షులు ఆనాల ఆదినారాయణరావు పాల్గొన్నారు.

ఇచ్చిన మాటకు కట్టుబడి పింఛన్ల పెంపు

తాడేపల్లిగూడెం రూరల్: ఇచ్చిన మాటకు కట్టుబడి సీఎం చంద్రబాబు నాయుడు పింఛన్లు పెంచారని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. సోమవారం మండలంలోని కృష్ణాయపాలెం గ్రామంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్ మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికీ పింఛన్ అందిస్తామని తెలిపారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ వలవల మల్లిఖార్జునరావు (బాబ్జీ) మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పరిమి రవికుమార్, నరిశే సోమేశ్వరరావు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ పట్టణంలో 9,389 పింఛన్లకు గాను 9,057 పింఛన్ల అందజేశారు. 332 పింఛన్ల పంపిణీ చేయాల్సి ఉంది. 96.46 శాతం పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ మురళీకృష్ణ సోమవారం రాత్రి వివరాలను వెల్లడించారు. మంగళవారం మిగిలిన పింఛన్ల పంపిణీ జరుగుతుందని తెలిపారు.

పెంటపాడు: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం పింఛన్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పెంటపాడు, కె. పెంటపాడు, ప్రత్తిపాడు, విప్పర్రు గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పాల్గొని పింఛన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సజ్జాపురం లయన్స్‌క్లబ్ నూతన కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన సజ్జాపురం లయన్స్ క్లబ్ కార్యవర్గ సభ్యులు

తణుకు: 2024–25 సంవత్సరానికి గాను సజ్జాపురం లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని సోమవారం తణుకులోని క్లబ్ భవనంలో నిర్వహించారు. అధ్యక్షుడిగా పులపా బాబుప్రసాద్, కార్యదర్శిగా అడ్డగర్ల వెంకటేశ్వరరావు, కోశాధికారిగా అనుబోయిన రాజులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ముఖ్యఅతిధులుగా పీఎంజేఎఫ్ దామెర రంగారావు, కొరిపల్లి సత్యనారాయణ, పీవీ సత్యనారాయణ, బండి వెంకటేశ్వరరావులు హాజరు కాగా సభ్యులు పుట్టా విజయశ్రీ, సనపల రమణభాస్కరరావు, బైలా లక్ష్మినారాయణ, వంగూరి కిశోర్, చేవూరి రమణమూర్తి, ఆర్‌వీవీ రత్నం, అందే వీర నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



వెంకట్రామన్నగూడెం పీహెచ్‌సీ నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



పట్టణంలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

తాడేపల్లిగూడెం రూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్యాధికారి శ్రీహర్ష అన్నారు. డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని వెంకట్రామన్నగూడెం గ్రామంలో దోమలు పుట్టకుండా ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీహర్ష మాట్లాడుతూ దోమల ద్వారా డెంగ్యూ వ్యాపిస్తుందన్నారు. తీవ్ర జ్వరం, తలనొప్పి, కండరాల నొప్పి, వికారం, చర్మంపై దద్దుర్లు రావడం, అలసట వంటివి డెంగ్యూ వ్యాధి లక్షణాలుగా పేర్కొన్నారు. ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించి చికిత్స పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

దోమల తెరలు వినియోగించుకోవాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పరిసరాల పరిశుభ్రత దోమల నివారణకు మార్గమని, ప్రతి ఒక్కరి సమష్టి భాగస్వామ్యంతో డయేరియా వంటి వ్యాధులను అరికట్టవచ్చని తాడేపల్లిగూడెం సబ్ యూనిట్ హెల్త్ అధికారి వై.వి.లక్ష్మణరావు పేర్కొన్నారు. డెంగ్యూ నివారణ మాసోత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణ ఆరోగ్య కేంద్రం వీకర్స్ కాలనీ, యాగర్లపల్లి, కడకట్ల, బేబి సెంటర్ జంక్షన్ వైద్యాధికారులు డాక్టర్ శ్రావ్య, డాక్టర్ అనూష అధ్యక్షతన సమావేశం జరిగింది. ర్యాలీ నిర్వహించారు. వై.వి.లక్ష్మణరావు మాట్లాడుతూ డెంగ్యూ నివారణ మాసోత్సవాలు ఈ నెల 31 వరకు జరుగుతాయని, ప్రతి సచివాలయం పరిధిలో డెంగ్యూ వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, లార్వా బ్రీడింగ్ ప్రదేశాలను కొనుగొనడం, తద్వారా మునిసిపల్ శానిటేషన్, పంచాయితీ సహకారంతో కీటక నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆరోగ్య కార్యదర్శి, ఆరోగ్య సహాయకులు కాంతారావు, పర్యవేక్షకులు పద్మ, మంగతాయారు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.

మిద్దె తోటల పెంపకంపై అవగాహన



వేల్పూరు గ్రామంలో మిద్దె తోటల పెంపకంపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

తణుకు: మండలంలోని వేల్పూరు గ్రామంలో తణుకు గార్డెన్‌గ్రూప్ ఆత్మీయ సమావేశంలో భాగంగా మిద్దె తోటల పెంపకంపై సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వెంకటరామన్నగూడెం వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం-కేవీకే ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో విస్తరణ సంచాలకులు డాక్టర్ ఇ.కరుణశ్రీ, కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ వి.దీప్తిలు మిద్దె తోటల పెంపకంపై మెళకువలు తెలిపారు. అభ్యుదయ మిద్దె తోటల పెంపకందారులు డాక్టర్ రామ్మోహన్‌రావు, వేల్పూరుకు చెందిన ఎం.సత్తిరాజు పాల్గొని రైతులకు సూచనలు చేశారు. ప్రసన్న ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 20 రకాల విత్తనా లు, చామంతి, దొండ, ప్యాషన్‌ఫ్రూట్, జీవన ఎరువులతో అభివృద్ధి చేసిన వర్మీకంపోస్టును అందజేశారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి



తణుకులోని రక్తదానం చేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

తణుకు టౌన్: రక్తదానం చేసిన ప్రతీ ఒక్కరూ ప్రాణదాతలు కావాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. రోటరీ క్లబ్ సభ్యులు ఆధ్వర్యంలో సోమవారం ఈ రక్తదాన శిబిరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలను జిల్లా రోటరీ గవర్నర్ ఎం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తణుకులోని డాక్టర్ ముళ్లపూడి హరిశ్చంద్రప్రసాద్ రెడ్‌క్రాస్ భవన్‌లో తణుకు రోటరీ క్లబ్‌కు చెందిన 35 మంది రక్తదానం చేసినట్లు తణుకు రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఆనందం మస్తాన్‌రావు (బాబి) తెలిపారు. ఈకార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు మస్తాన్‌రావు (బాబి), కార్యదర్శి కఠారి సిద్దార్థ, మాజీ అధ్యక్షుడు జీ సుధాకర్, సభ్యులు గమిని రవికృష్ణ, తదితరులు రక్తదానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లడ్ బ్యాంక్ మేనేజర్ కారుమంచి యోహాను, రోటరీ సభ్యులు గమిని రాంబాబు, డాక్టర్ వీ వెంకటరాజు, వంగూరి హనుమంతరావు, బసవ రామకృష్ణ, అక్కిన కాశీవిశ్వనాథం, కేటీపీ రెడ్డి, ఎం వెంకటేశ్వరరావు, రెడ్డి రంగారావు, తదితరులు పాల్గొన్నారు.

స్టాప్ డయేరియాపై అవగాహన

ఇరగవరం: డయేరియా వంటి వ్యాధులు సోకకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని మండల ప్రత్యేక అధికారి ఎం.ప్రభాకరరావు తెలిపా రు. ఇరగవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో స్టాప్ డయేరియాపై అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకరరావు మాట్లాడుతూ జూలై 1వ తేదీ నుంచి ఆగస్టు 31 వరకు డయేరియాపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యుల సేవలు వెలకట్టలేనివి



తాడేపల్లిగూడెం (టీఓసీ): వైద్యులను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు



అత్తిలి: పీహెచ్‌సీలో వైద్యులను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు



తణుకుటౌన్ : వైద్యులను సన్మానిస్తున్న లయన్స్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): వైద్య వృత్తిని దైవంగా భావించి పేదలకు సేవ చేసినప్పుడే డాక్టర్‌గా విజయం సాధించినట్లు అవుతుందని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వీవీఎస్ లక్ష్మినారాయణ తెలిపారు. సోమవారం స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే, చార్టెడ్ అకౌంట్స్ డే ను ఘనంగా నిర్వహించి, పలువురి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి భీమవరపు మహాలక్ష్మి, పంకజాక్షన్, సుంకర శ్రీనివాస్, మదన్‌మోహన్ అగర్వాల్, పేరూరి కాశయ్య పాల్గొన్నారు.

మహిళా వాకర్స్ ఆధ్వర్యంలో..

నేషనల్ డాక్టర్స్‌డే సందర్భంగా సోమవారం ఎయిర్‌స్ట్రిప్ వాకర్స్ మహిళా అధ్యక్షురాలు వనచర్ల విజయలక్ష్మి ఆధ్వర్యంలో పట్టణంలోని పలువురు వైద్యులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహిళా వాకర్స్ మేరీ, వజ్రమ్మ, ఇందిరా కుమారి, అరుణ కుమారి, రామలక్ష్మి, నాగేంద్ర ప్రసాద్, నరసింహమూర్తి పాల్గొన్నారు. వాసవి క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్స్‌డే పురస్కరించుకుని వైద్యులు శోభారాణి, వంశీలను సత్కరించారు. నున్న ఆనంద్, సీహెచ్‌ఎన్ గుప్తా, కె.రంగరావు, ఆలపాటి అచ్యుత లక్ష్మి, నున్న నాగలక్ష్మి పాల్గొన్నారు.

ఎయిర్‌స్ట్రిప్ వాకర్స్ ఆధ్వర్యంలో...

ఎయిర్‌స్ట్రిప్ వాకర్స్ ఆధ్వర్యంలో అసోసియేషన్ అధ్యక్షులు దూలం నాగరాజు నేతృత్వంలో పలువురి వైద్యులను ఘనంగా సన్మానించారు. కోశాధికారి మల్లారెడ్డి సారథి, కోపల్లె శ్రీనివాస్, పి.కుమార్‌స్వామి పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రిలో

జ్యోతిస్కూల్ ఆఫ్ నర్సింగ్ వారిచే ఏరియా ఆస్పత్రిలోని వైద్యులందరిని సత్కరించారు. ఏరియా ఆసుపత్రి సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా డాక్టర్స్‌డే వేడుకలు

అత్తిలి: లయన్స్‌క్లబ్ ఆఫ్ అత్తిలి ఆధ్వర్యంలో సోమవారం అత్తిలి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో డాక్టర్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలకు వైద్యసేవలు అందజేస్తున్న వైద్యులు డాక్టర్ కె నాగరాజు, డాక్టర్ కిరణ్మయిలను లయన్స్‌క్లబ్ తరపున ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా లయన్స్‌క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ అత్తిలిలో లయన్స్‌క్లబ్ సభ్యుల ఆర్థిక సహకారంతో నిర్మిస్తున్న డయాలసిస్ సెంటర్‌ను త్వరలో ప్రారంభిస్తామని చెప్పారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సెక్రటరీ బండి గంగాధర్, జిల్లా చైర్ పర్సన్ యాతం రాంబాబు, మాజీ అధ్యక్షుడు పట్నాల బాబు, క్లబ్ సభ్యులు టి జయసూర్య, దాసం బాబ్జి, వర్ధినీడి వెంకటశివ, కొండబాబు, సుబ్బరాజు, సన్నిధి శ్రీనివాసగుప్త, సంకు బాబూరావు, నిమ్మల సూరిబాబు పాల్గొన్నారు.

వైద్యులు దేవునితో సమానం

ఇరగవరం: వైద్యులు దేవునితో సమానం అని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. సోమవారం ఇరగవరం మండలం రేలంగి పీహెచ్‌సీలో డాక్టర్స్‌డే సందర్భంగా పీహెచ్‌సీలో పనిచేస్తున్న వైద్యులను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. పీహెచ్‌సీ వైద్యులు బంగారు రవి, సాయి రెడ్డి సొసైటి అధ్యక్షుడు నడుంపల్లి రాంబా బు రాజు, గ్రామ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

డాక్టర్ల సేవలు అమోఘం

తణుకు టౌన్: తణుకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్స్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారం తణుకు లయన్స్ క్లబ్ ఆడిటోరియంలో తణుకు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సప్పా బలరామకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన జాతీయ వైద్యుల దినోత్సవంలో పలువురు వైద్యులను ఘనంగా సన్మించారు. ఈకార్యక్రమంలో లయన్స్ కార్యదర్శి ఎం రవి రిజనాల్డ్, కోశాధికారి సీహెచ్ శ్రీనివాసు, లయన్స్ సభ్యులు వై నాగరాజు, కడియాల సూర్యనారాయణ, ఏ కరుణాకర్ చౌదరి, ఎంఆర్ కోటేశ్వరరావు, పీవీ రమణ, నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

పీఎంపీల అసోసియేషన్ ఆధ్వర్యంలో...

తణుకు మండల పీఎంపీ వైద్యుల అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ వైద్యుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తణుకు మండల పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు సరెళ్ల వీరతాత, కార్యదర్శి ఎస్ రమేష్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

తణుకు: తణుకు గోదావరి అర్బన్ మల్టీస్టేట్ క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం తణుకులో ఘనంగా వైద్యుల దినోత్సవాన్ని నిర్వహించారు. వైద్యులు ప్రజలకు ఉన్నతమైన ఆరోగ్య సేవలు అందజేయాలని బ్రాంచ్ మేనేజర్ వై.రమేష్ ఆకాంక్షించారు. అనంతరం ప్రముఖ వైద్యులు డాక్టర్ మాగంటి రాజేష్‌ను ఘనంగా సత్కరించారు.